# పన్ను వసూళ్లపై స్పెషల్‌ ఫోకస్‌

- పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన పాత బకాయిలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు
- వసూలైన పన్ను శాతం 54.80
- స్పెషల్‌ డ్రైవ్‌తో రంగంలోకి ప్రత్యేక బృందాలు
- వందశాతం వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు (పురపాలికలు), గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టిసారి స్తోంది. వచ్చే మార్చితో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేలా పురపాలక సంఘాలు, జీపీలు స్పెషల్‌ డ్రైవ్‌కు సిద్ధమవుతున్నాయి. వీరిని రంగంలోకి దింపటం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తుంది. ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లేని పక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడగలదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

### పట్టణాలు.. జీపీల్లో పన్నుల లక్ష్యం రూ.182 కోట్లు

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతోపాటు 34 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు (పురపాలక సంఘాల్లో రూ.172 కోట్లు, జీపీల్లో రూ.10.76 కోట్లు) కాగా, ఇప్పటి వరకు 54.80 శాతం పన్నుల వసూళ్లు చేశారు. వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. అప్పటి వరకు వంద శాతం పన్నుల వసూళ్ల కోసం స్పెషల్‌ డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి 2 శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్‌ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటా పెరిగిపోతున్నాయి.

### పేరుకుపోయిన వాటితో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ.కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. దీనికి తోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి నుంచి పట్టణాలు, జీపీలు బయటపడాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రామంతాపూర్‌: బాలకృష్ణనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించడానికి ఇటీవల స్థానిక సంక్షేమ సంఘం నేతలు ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జ్‌ మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి తీసుకెళ్లి డ్రైనేజీ నిర్మాణానికి రూ.71,40,000 నిధులు మంజూరు చేయించారు. బుధవారం డివిజన్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు మహ్మద్‌ రఫీక్‌, కేసీఆర్‌నగర్‌ బాలకృష్ణనగర్‌లో కాంగ్రెస్‌ కార్యకర్తలు బాలకృష్ణనగర్‌ నివాసులతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలు రాజిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సందీప్‌, భాస్కర్‌, బిక్షపతిచారి, వేణుగోపాల్‌చారి, రుక్కయ్యయాదవ్‌, సైదులుయాదవ్‌, సంధ్యారాణి, శోభా, అంబికా, జంగయ్య తదితరులున్నారు.

## ఆటోలో అసెంబ్లీకి ఎమ్మెల్యే !

కాప్రా: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆటో డ్రైవర్లకు మద్దతుగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలను ఎక్కించుకుని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వయంగా ఆటో నడుపుతూ అసెంబ్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆటోడ్రైవర్ల ఆత్మహత్యకు కాంగ్రెస్‌ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఉపాధి కోల్పోయి వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధైర్యాన్ని కోల్పోవద్దని, బీఆర్‌ఎస్‌ పార్టీ అండగా ఉందని, న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి రూ. 12 వేల ఆర్థికసాయం అందజేయాలన్నారు.



ఆటో నడుపుతూ అసెంబ్లీకి వెళ్తున్న ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కేటీఆర్‌ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు మద్దతుగా..

## క్లుప్తంగా

### జర్నలిస్టును పరామర్శించిన ఎమ్మెల్యే



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన జర్నలిస్టు కడియాల రమేష్‌ను బుధవారం ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నిమ్స్‌ ఆసుపత్రిలో పరామర్శించారు. గత సోమవారం ఆయన ఎస్‌ఎఫ్‌సీ బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రమేష్‌ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. బన్నాల ప్రవీణ్‌ ముదిరాజ్‌, ఎంపల్లి పద్మారెడ్డి, కేవీఎల్‌ఎన్‌ రావు, భరత్‌ తదితరులున్నారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవపాటిల్‌కు మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. కేఎల్‌రెడ్డినగర్‌, ఎస్వీనగర్‌, బ్రహ్మపురికాలనీ, వెంకటరమణ, గ్రీన్‌హిల్స్‌ కాలనీ, గోకుల్‌నగర్‌లో సీసీరోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దత్తాత్రేయనగర్‌ మై ఫ్లవర్‌ పార్క్‌, కేఎల్‌రెడ్డినగర్‌ జనప్రియ టౌన్‌షిప్‌లోని పార్కుల్లో ఓపెన్‌ జిమ్‌లను ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కార్పొరేటర్‌ కోరారు.

### ఆలయ హుండీ లెక్కింపు



సత్యదేవుని ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

రామంతాపూర్‌ : రామంతాపూర్‌ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానం ఆలయ హుండీని బుధవారం ఆలయ ఈవో విజయభారతి ఫౌండర్‌ ఫ్యామిలీ మెంబర్‌ కోట్ల నర్సింహారెడ్డి ప్రధాన అర్చకులు తిరుపతాచార్య సమక్షంలో లెక్కించారు. గత 3 నెలలుగా భక్తులు హుండీలో వేసిన నగదు రూ.2,91,203 ఆదాయం వచ్చిందన్నారు.

### అంగన్‌వాడీ టీచర్‌ పదవీ విరమణ



విజయను సత్కరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మల్లాపూర్‌: మల్లాపూర్‌ లింగమయ్యనగర్‌ అంగన్‌వాడీ టీచర్‌ సీహెచ్‌. విజయ పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం అంబేడ్కర్‌ భవన్‌లో ఆమెను ఘనంగా సత్కరించారు. అల్వాల్‌ సీడీపీఓ స్వాతి, మల్లాపూర్‌ కార్పొరేటర్‌ పన్నాల దేవేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్‌ భాగ్యలక్ష్మి, నిర్మల, నిర్మలారెడ్డి, మల్లాపూర్‌ సెక్టార్‌ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

### క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు



బ్యాడ్మింటన్‌ క్రీడాకారులతో ఉప్పల శ్రీనివాసగుప్తా

ఉప్పల్‌: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, మేడ్చల్‌– మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్తా అన్నారు. ఈ మేరకు ఉప్పల్‌లోని ఎలైట్‌ గ్యారేజ్‌ క్రీడా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన జిల్లా బ్యాడ్మింటన్‌ సెలక్షన్‌ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కప్‌– 2024ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాపాలనతో ప్రజల కష్టాలను రాష్ట్ర ప్రభుత్వం తీరుస్తూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ 2,3,5,6,14 వార్డుల్లో డ్రైనేజీ, సీసీరోడ్ల అభివృద్ధి పనులకు మేయర్‌ అమర్‌సింగ్‌ శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌ యాదవ్‌, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌, డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌ పాల్గొన్నారు. మేయర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ డివిజన్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లు, కమిషనర్‌, డీఈ, పీర్జాదిగూడ పార్టీ అధ్యక్షుడు, సీనియర్‌ నాయకులు, మహిళానాయకురాలు, డివిజన్‌ నాయకులు, కాలనీ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

# వక్ఫ్‌ భూముల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలోని వక్ఫ్‌ భూముల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సీఎంకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం వక్ఫ్‌బోర్డు సీఈఓ ఆదేశాల మేరకు మల్కాజిగిరిలో సుమారు 382 ఎకరాల్లో 100 సర్వే నెంబర్లతో వక్ఫ్‌ బోర్డు భూములున్నాయని, వాటిలో రిజిస్ట్రేషన్‌ నిలిపివేయాలని డిస్ట్రిక్‌ రిజిస్ట్రార్‌కు ఆదేశాలు రావడంతో రిజిస్ట్రేషన్లు నిలిపివేశారన్నారు. వందలాది కాలనీలు వేలల్లో ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేద, మధ్యతరగతి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

# వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



అయ్యప్పస్వామి మహాపడిపూజలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



మెట్టుగూడలో కూచిపూడి నృత్య ప్రదర్శన

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని సంజయ్‌నగర్‌లో సిరిగిరి శ్రీధర్‌ గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మౌలాలి: అయ్యప్పస్వామి మహా పడిపూజ సందర్భంగా మెట్టుగూడలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కూచిపూడి నృత్యం చేస్తున్న మైల జాహ్నవితో పాటు మరికొంత మంది కలిసి నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

# రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్‌ నేతలు



చలో రాజ్‌భవన్‌కు కాప్రా కాంగ్రెస్‌ నేతలు



మైనంపల్లి ఆధ్వర్యంలో..

కాప్రా: కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ‘చలో రాజ్‌భవన్‌’ కార్యక్రమానికి కాప్రా కాంగ్రెస్‌ నేతలు తరలివెళ్లారు. ఉప్పల్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా కార్పొరేటర్‌ స్వర్ణరాజ్‌ శివమణి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ శ్రేణులు తరలివెళ్లారు. అదానీపై జేపీసీ విచారణ, మణిపూర్‌లో శాంతిభద్రతలు తదితర విషయాల పట్ల కేంద్ర వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. నెక్లెస్‌ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్‌ వరకు పీసీసీ చీఫ్‌ మహేష్‌కుమార్‌గౌడ్‌ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్‌ నేతలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్‌ శ్రేణులు రాజ్‌భవన్‌ వద్ద జరిగిన ధర్నాకు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌, నేతలు వెంకటేష్‌యాదవ్‌, శ్రీను, బాబు, సత్యనారాయణ, ఇందిరాప్రియదర్శిని, ఇస్తారి తదితరులున్నారు.

# గంజాయి కేసులో ఇరికించాలని.. ఇరుక్కుపోయారు

మల్లాపూర్‌: పాత కక్షలతో వ్యక్తిని గంజాయి కేసులో ఇరికించాలనే దురాలోచన కాస్త బట్టబయలైంది. ద్విచక్రవాహనంలో గంజాయి ఉంచిన కుట్ర బట్టబయలైంది. గంజాయి పెట్టిన వ్యక్తితో పాటు మరో నలుగురిపై నాచారం పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్‌ రుద్వీర్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం రాత్రి ఓ వ్యక్తి పల్సర్‌ బైక్‌లో గంజాయి తీసుకెళ్తున్నాడని, 100కు సమాచారమిచ్చారు. తనిఖీ చేయగా..60 గ్రా. గంజాయి దొరికింది. యజమాని వినోద్‌ను ఆరా తీయగా.. తాను గంజాయి బైకులో ఉంచలేదని, నాచారం కొండిన్యనగర్‌ కాలనీకి చెందిన నాగభూషణంపై అనుమానం ఉందన్నాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## 22న ఉచిత వైద్య శిబిరం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ కమ్యూనిటీహాల్‌లో ఈనెల 22న ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచిత మెగా హెల్త్‌ క్యాంప్‌ జరుగుతుందని త్రిశక్తి సేవాసమితి నిర్వాహకులు సూర్యకుమారి, సునీత, రవికుమార్‌లు తెలిపారు. ఈస్ట్‌ మారేడ్‌పల్లిలోని షెనాయి ఆసుపత్రి వైద్య బృందం ఈఎన్‌టీ, షుగర్‌, సాధారణ, ఆర్థోపెడిక్‌ పరీక్షలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9989311915.

## పేకాడుతున్న ఐదుగురి రిమాండ్‌

రూ.13,200 నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మేడిపల్లి: పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చుసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం విశ్వసనీయ సమాచారం మేరకు ప్రతాప్‌ సింగారం గ్రామంలోని తేజస్వీ కాలనీలోని నూతన భవనంలో పేకాడుతున్న స్వామి(43), ప్రవీణ్‌కుమార్‌(33), వెంకట బ్రమ్మయ్య(46), గొంగటి మల్యాద్రి (37), మామిడ్ల నాగేష్‌కుమార్‌ (37)లను మేడిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

## ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



కుషాయిగూడ: యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్‌, కుషాయిగూడలో ఏర్పాటు చేసిన ‘యారో డ్రైవ్‌ ఇన్‌మోర్‌’ రెస్టారెంట్‌ను బుధవారం స్థానిక కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత అన్ని రంగాల్లో రాణించాలని, ఎంచుకున్న రంగంలో క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడి పనిచేసినప్పుడే లక్ష్యానికి చేరువవుతారన్నారు. నాణ్యమైన వంటకాలను అందజేసి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. గుమ్మడి జంపాల్‌రెడ్డి, రాహుల్‌, తిలక్‌యాదవ్‌, వివేక్‌యాదవ్‌, సందీప్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్ర

మేడ్చల్‌: దేశంలో గోరక్ష, భూరక్ష చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన పర్యావరణవేత్త బాలకృష్ణ కాశ్మీర్‌ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం మేడ్చల్‌కు చేరింది. జాతీయ రహదారి పై మేడ్చల్‌లో పాదయాత్రకు హిందూ సంఘాల వారు, అయ్యప్పస్వాములు, ప్రకృతి ప్రేమికులు స్వాగతం పలికారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం నుంచి అయ్యప్ప ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు.

## విద్యార్థులతో చైర్మన్‌ సహపంక్తి భోజనం

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చైర్మన్‌ కొండల్‌రెడ్డి విద్యార్థులతో కలిసి బుధవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలిని, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వరూప, మాజీ ఉప సర్పంచ్‌ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటికలో వసతులు కల్పించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

మల్లాపూర్‌: నాచారం రెడ్డి సంఘం శ్మశానవాటికలో వసతులను కల్పించాలని కోరుతూ బుధవారం నాచారం కార్పొరేటర్‌ శాంతిసాయిజెన్‌శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ గతంలో శ్మశానవాటికలో రూ.10 లక్షలతో సీసీరోడ్డు వంటి పనులను చేపట్టామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేసి వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు పోగుల వెంకటరమణారెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, సలహాదారులు, కృష్ణారెడ్డి ఉన్నారు.

# రేపటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



గుండం బాలాజీ వేంకటేశ్వరస్వామి

అల్వాల్‌: టెంపుల్‌ అల్వాల్‌లోని 850 ఏళ్ల పురాతనమైన గుండం బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుండి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 20న శుక్రవారం మృత్సంగ్రహణం, అంకురార్పణ, 21న శనివారం ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరిపూజ, పల్లకిసేవ, 22న ఆదివారం పల్లకిసేవ, గరుడసేవ, స్వామివారి తిరు కల్యాణోత్సవం, 23న సోమవారం పల్లకిసేవ, 24న మంగళవారం హవనం, పూర్ణాహుతి, అవబృథోత్సవం, అన్నదానం, సాయంత్రం పుష్పయాగం, ద్వాదశ ఆరాధన కార్యక్రమాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలని కోరారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఉచిత శిక్షణ శిబిరంలో కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి

మౌలాలి : మహిళలు తలుచుకుంటే ఏ రంగాల్లోనైనా విజయం సాధించి తీరుతారని కార్పొరేటర్‌ రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం వినాయక్‌నగర్‌ కమ్యూనిటీ సెంటర్‌లో 6 వారాల బేకరీ కోర్సును ‘సీఓడబ్ల్యూఈ’ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని కార్పొరేటర్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులు వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె మాట్లాడుతూ.. కోవలాంటి సంస్థ ఉన్నత స్థాయిలోకి తీర్చిదిద్దేందుకు ఎంతో శ్రమిస్తున్నారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. టైలరింగ్‌ జూట్‌బ్యాగ్‌ మేకింగ్‌, శానిటరీ నాప్కిన్స్‌, మేకింగ్‌, కంప్యూటర్‌ బేసిక్‌ ఎడ్యుకేషన్‌లో ఇప్పటి వరకు 300 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఎంఎస్‌ఎంఈ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ సుమతి, వైస్‌ ప్రెసిడెంట్‌ కల్పన, కో– ఆర్డినేటర్‌ శాంతి, బీజేపీ నేతలు ఓంప్రకాష్‌, సుశీల, గోపాలకృష్ణ, నరసింగరావు, గోపాల్‌ యాదవ్‌ పాల్గొన్నారు.

## కాలేజీపై కేసు నమోదు

మల్లాపూర్‌: ఓ ఈవెంట్‌లో అనుమతులు లేకుండా సౌండ్‌ సిస్టమ్‌ ఏర్పాటు చేసి చుట్టు పక్కల వారికి ఇబ్బంది కలిగించినందుకు కాలేజీపై కేసు నమోదైంది. ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నాచారంసెయింట్‌ పాయిస్‌ మహిళా పీజీ కళాశాలలో కృత్య ఈవెంట్‌ను నిర్వహిస్తూ.. అనుమతులు లేకుండా డీజే, సౌండ్‌ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీంతోకాలేజీ యాజమాన్యం, డీజే నిర్వాహకుడు ప్రసన్నకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ముగిసిన కృత్య వార్షిక సదస్సు



కృత్య వార్షిక సదస్సు సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

మల్లాపూర్‌: నాచారం సెయింట్‌ పాయిస్‌ పీజీ, ఎంబీఏ మహిళా కళాశాలలో నిర్వహించిన కృత్య యాజమన్య వార్షిక సదస్సు– 2024 బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సెక్రటరీ సిస్టర్‌ ఆల్‌పోనసా, డైరెక్టర్‌ వేళాగిని హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రదర్శనలు చేసిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కృత్య వార్షిక– 2024 సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు.